

# 4. సంతృప్తి

**నేపథ్యం:**

- నీవద్ద ఉన్న వాటికి తక్కువగాను
  నీవద్ద లేని వాటికి ఎక్కువ గాను
  విలువ కట్టడమే 'సంతోషానికి' అడ్డుగోడ

- నీకు ఏయే విషయాలు సంతోషాన్నిస్తాయి?
  ఇప్పుడు ఉడుత – తోడేళ్ళు ఏమని సంభాషించుకున్నాయో చూద్దామా!

కుచ్చుతోక నాడిస్తూ
కొమ్మ లెక్కిదూకేస్తూ
ఉడత ఒకటి సరదాగా
అడవిలోన తిరుగసాగె 1





అంతలోన పట్టు తప్పి
ఆకతాయి ఉడత తూలి
నేలపై పరుండినతో
డేలు మీద జారి పడియె 2




హుమ్మని తోడేలు ఉడత
నొడిసి పట్టి చంపబోవ
విడువు మంచు దీనంగా
ఉడుత వేడుకోసాగెను. 3



విడిచి పెట్ట మంటావా?
ఉడతమ్మా సరేగాని
సందేహం నాకొక్కటి
ఉంది నీవు తీర్చాలది. 4

ఏ వేళను నిను జూచిన
ఎంతో సంతోషంతో
అరచుచుందు వెగురుచుందు
వది యెట్లా సాధ్యమయ్యె 5






గుప్పెడైన లేని నీకు
కో కొల్లగ తృప్తి యేమి
నేనింతటి వాణ్ణి కదా!
ఏలనాకు సుఖం లేదు? 6

అప్పుడిట్లు పలికె నుడుత
'అయ్యా తోడేలు గారు
వదిలేస్తే కొమ్మ ఎక్కి
పదిలంగా పలుకగలను' 7

తోడేలుకు జాలిపుట్టె
ఉడతమ్మను విడిచిపెట్టె
మెరపులాగ కొమ్మమీది
కురికి ఉడత చెప్పెనిట్లు 8





పరులకెపుడు కీడు చేసి
ఎరుగని మా ఉడుత జాతి
కానందం కాకేమిటి
సంతృప్తికి లోటేమిటి? 9

## I. వినండి–సంభాషించండి.

1. దేనిని తృప్తి అంటారు?
2. మీకు తృప్తిని కలిగించిన ఏదైనా ఒక సంఘటన గురించి చెప్పండి.
3. యూ ట్యూబ్‌లో చూసి, చదివి, మీకు నచ్చిన కథలను గూర్చి సంభాషించండి.

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం–భావాలు నేర్చుకుందాం.

పట్టు తప్పి = పట్టుకున్నది జారి; ఆకతాయి = అల్లరి; ఒడిసిపట్టి = గట్టిగా పట్టుకొని; సందేహము = అనుమానము; కోకొల్లగ = అధికముగా; మిక్కుటముగా = ఎక్కువగా; పదిలంగా = చక్కగా, జాగ్రత్తగా.

1. ఒక ఉడత ఒక కొమ్మనుంచి మరొక కొమ్మ మీదకి దూకుతూ తన తోకను ఆడిస్తూ అడవిలో తిరుగసాగింది.
2. అంతలోనే పట్టుతప్పి ఆ అల్లరి ఉడుత నేలమీద పడుకొని ఉన్న తోడేలు మీద పడింది.
3. తోడేలు దానిని గట్టిగా పట్టుకొని చంపుటకు ప్రయత్నించబోగా తనను విడిచిపెట్టమని ఆ ఉడుత దీనంగా వేడుకోసాగింది.
4. ఓ ఉడతమ్మా! నిన్ను విడిచిపెట్టమంటావా? అది సరేగాని నాకు ఒక అనుమానం ఉన్నది. నువ్వు దానిని తీర్చాలి.
5. నువ్వు ఎప్పుడు చూచినా ఎంతో సంతోషంతో అరుస్తుంటావు, ఎగురుతుంటావు. అది ఎలా సాధ్యమైంది?
6. ఇంత చిన్నదానివైన నీకు అంత సంతోషము ఎట్లు కలిగినది. నేను ఇంత గొప్పవాణ్ణి కదా! నా కెందుకు సుఖము లేదు.
7. అప్పుడా ఉడుత తోడేలుతో "నన్ను వదిలి పెట్టినచో కొమ్మ ఎక్కి జాగ్రత్తగా అంతయు చెప్పెదను" అనెను.
8. తోడేలుకు జాలి కలిగి, దానిని విడిచిపెట్టెను. అప్పుడు ఆ ఉడత కొమ్మ ఎక్కి ఇట్లు చెప్పసాగెను.
9. ఎప్పుడూ మా ఉడతజాతి ఇతరులకు కీడు చేయుట అనునది ఎరుగదు. అటువంటి మాకు ఆనందానికి, సంతృప్తికి కొదువ ఉండదు.



## III. కృత్యము

పాఠ్య భాగంలోని కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ. (i) జతపరచండి.

| | |
|---|---|
| 1. ఉడత సరదాగా | నొడిసిపట్టి చంపబోవ |
| 2. ఆకతాయి ఉడత | అడవిలోన తిరుగసాగె |
| 3. (ఉడత) దీనంగా | తోడేలుపై జారిపడియె |
| 4. తోడేలు ఉడత | వేడుకోసాగెను. |

(ii) పాఠ్యభాగంలోని 1, 2, 3 గేయఖండిల్లో గల ప్రాసపదాలను ఏరి రాయండి.

(1, 2, 3 గేయఖండికలు)

ఆ. స్వీయస్పందన

"ఉడత తోడేలును వేడుకోవలసి వచ్చింది" ఎందుకు? మీ సొంత వాక్యాల్లో రాయండి.

## IV. వినండి–చర్చించండి–రాయండి.

అ. జవాబులు రాయండి.

1. తోడేలు ఉడతను ఒడిసి పట్టుకొనుటకు కారణము.
2. "ఉడత–తోడేలు" సంభాషణ.
3. ఉడత ఆనందంగా ఉండటానికి కారణం.

ఆ. సరైన పదాన్ని ఎన్నుకొని ఖాళీలను పూరించండి.

1. సరదాగా ________________ లోన తిరుగసాగె.

   1. తోట   2. అడవి   3. ఉద్యానవనం

2. విడిచిపెట్టమంటావా ________________

   1. ఉడతమ్మా   2. కోకిలమ్మా   3. కాకమ్మా

3. ఎంతో ________________ అరచుచుందువు.

   1. దుఃఖంతో   2. సంతోషంతో   3. విచారంతో

4. కొమ్మ ఎక్కి ________________ పలుకగలను.

   1. జాగ్రత్తగా   2. పదిలంగా   3. మెల్లగా

ఇ. ఎవరు ఎవరితో పలికిరి.

1. విడిచి పెట్టమంటావా.
2. కొమ్మ ఎక్కి పదిలంగా పలుకగలను.

ఈ. కింది గేయపాదాలను సరైన క్రమంలో అమర్చి రాయండి.

**సంతృప్తికి లోటేమిటి**
**ఉడత ఒకటి సరదాగా**
**ఏల నాకు సుఖంలేదు**
**అరచుచుందు వెగురుచుందు.**

## V. స్వీయస్పందన:

1. నీకు నచ్చిన ఏదైనా కథను నీ సొంత మాటల్లో రాయి.
2. ఉడత, తోడేలు మధ్య జరిగిన సంభాషణను నీ సొంత మాటల్లో రాయి.

## VI. భాషావగాహన :

అ. ఏ వచనమో రాయండి.

1. కొమ్మలు ☐
2. సందేహము ☐
3. జాతులు ☐
4. తోడేలు ☐

ఆ. గీతగీసిన పదాలను ఆయా భాషాభాగాలతో జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | తోడేలుకు జాలిపుట్టె | అ. | నామవాచకము |
| 2. | ఉడతమ్మను విడిచిపెట్టి | ఆ. | క్రియ |
| 3. | సంతోషంతో అరచుచుండ | ఇ. | సర్వనామం |
| 4. | నేను ఇంతటివాణ్ణి | ఈ. | విశేషణము |

ఇ. కలిపి రాయండి.

1. కొమ్మలు + ఎక్కి
2. ఉడత + అమ్మ
3. అది + ఎట్లా
4. తీర్చాలి + అది

## VII. సృజనాత్మకత

**1.** గడినుడిలోని అక్షరాలతో పదాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| జా | తో | ప | నం |
| డే | లి | సు | ద |
| లు | ఆ | పు | ము |
| అ | గ్గి | పె | ట్టె |

1. ______________ 2. ______________

3. ______________ 4. ______________

5. ______________ 6. ______________

**2.** 'మేక-తోడేలు కథ' అంతర్జాలంలో చదివి మీ సొంత వాక్యాల్లో రాయండి.

## VIII. లేఖననైపుణ్యాలు:

**1.** వ్యాసరచన:

వర్ణనాత్మకం

కింది పదాల ఆధారంగా సముద్ర తీరాన్ని గురించి 8-10 వాక్యాల్లో వర్ణనాత్మక లేఖనం చేయండి.

సముద్రతీరం → అలలు → సుందర ప్రదేశం → ప్రకృతి సౌందర్యం → నా అనుభూతి

**2.** కింది అంశాల ఆధారంగా కథ రాయండి. తగిన శీర్షిక పెట్టండి.

**కథాలేఖనం:**

రంగడు ఎండిన కొమ్మలు కొట్టుటకు అడవికి వెళ్ళుట – గొడ్డలి నదిలో పడుట – రంగడు దుఃఖించుట – వనదేవత ప్రత్యక్షమగుట – బంగారు గొడ్డలి చూపుట రంగడు తనది కాదనుట – వెండి గొడ్డలి చూపుట – రంగడు నిరాకరించుట – దేవత రంగడి గొడ్డలి చూపుట – రంగడి సంతోషం – దేవత రంగడి నిజాయితీకి మెచ్చి మూడింటిని రంగడికి ఇచ్చుట



నేనివి నేర్చుకున్నా.

1. ఇతరులకు కీడు చేయకూడదు.
2. ఉన్నదానితో తృప్తిపొందవలెను.
3. అల్పులు, గొప్పవారు అను బేధ భావాన్ని చూపరాదు.

9HA7AU

వి.సూ: కొన్ని గేయ కథలను సేకరించండి.